‘ఆమె’కు కేంద్రం పెద్దపీట

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- తల్లీబిడ్డల పౌష్టికాహార మోదీ కిట్ల పంపిణీ


కార్యక్రమంలో తల్లీబిడ్డలతో సెల్ఫీలు దిగుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్: మహిళాసంక్షేమానికి ప్రధాని నరేంద్రమోదీ అనేక పథకాలు ప్రవేశపెట్టారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. తల్లీబిడ్డలకు పౌష్టికాహార మోదీ కిట్లను దేశవ్యాప్తంగా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం ముషీరాబాద్‌లోని కషిష్ హాల్‌లో అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్తీ బేబీ షో 2024 కార్యక్రమాన్ని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం నేత రమేష్‌రాం అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌తో కలిసి పౌష్టికాహార మోదీ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు, ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఉచిత వైద్యం, దేశవ్యాప్తంగా మహిళల కోసం 12 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం తదితర కార్యక్రమాలను మోదీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఆరు నెలలుగా పౌష్టికాహార కిట్లను నగరంలో పంపిణీ చేస్తున్నామని, రానున్న రోజుల్లో అన్ని ప్రాంతాలలో ఈ కార్యక్రమాన్ని చేపడతామని కిషన్‌రెడ్డి చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు ఎన్‌జీవో సంస్థలు ముందుకు వచ్చి తల్లీబిడ్డల సంక్షేమం కోసం పౌష్టికాహార కిట్లను అందజేసే విధంగా కృషి చేయాలని కోరారు. ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రతిపక్షాలు ప్రధాని మోదీకి కుటుంబం లేదని చౌకబారు విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. దేశ ప్రజలంతా మోదీ కుటుంబసభ్యులే అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రజల సంక్షేమానికి పాటుపడుతుంటే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు వారి కుటుంబసభ్యుల సంక్షేమానికి ఆరాటపడుతున్నాయని విమర్శించారు. మహిళలు అన్ని రంగాలలో రాణించే విధంగా మోదీ అంకితభావంతో పనిచేయడంతోపాటు సైనిక్ స్కూల్‌లో బాలికలు చదువుకునేందుకు రిజర్వేషన్లు సైతం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. మహిళాసంక్షేమంలో భాగంగా బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కిషన్‌రెడ్డి, డాక్టర్ కె.లక్ష్మణ్‌లు హెల్తీ బేబీ షోలో తల్లీబిడ్డలతో సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి, డాక్టర్ కె.లక్ష్మణ్‌లను రమేష్‌రాం సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, రవిచారి, రచనశ్రీ, పావనీ వినయ్‌కుమార్, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌సుందర్‌గౌడ్, భారత్ డైనమిక్ లిమిటెడ్ డైరెక్టర్‌లు వీవీ రాజారాం, ఎ.మాధవరావు, బీజేపీ నాయకులు చంద్రమోహన్, మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి శంకరమఠం ముస్తాబు

నల్లకుంట: ఈ నెల 8న(శుక్రవారం) నిర్వహించనున్న మహా శివరాత్రి వేడుకలకు నల్లకుంట శంకరమఠంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు శంకరమఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కె.కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 9 గంటలకు రుద్రహోమం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ప్రదోషకాల శత రుద్రాభిషేకం, 7 గంటలకు గీతాగణేశన్ ఉత్తర కళాక్షేత్రం బృందంచే నాట్యాంజలి, రాత్రి 9 గంటల నుంచి లింగోద్భవకాల శత రుద్రాభిషేకం ఉంటుందని చెప్పారు. మరుసటి రోజు(శనివారం) ఉదయం 9.30 గంటలకు గిరిజా ‘కళ్యాణం’ఉంటుందని, సాయంత్రం 6.30 గంటలకుసాయి శ్రుతి మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో టీవీ, ఆలిండియా రేడియో కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణమూర్తి శిష్య బృందంచే ‘భక్తి సంగీత విభావరి’ఉంటుందన్నారు.

నాలాల్లో పూడికతీతలు పూర్తి చేయండి


పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్

కాచిగూడ: వర్షాకాలంలోపు నాలాల్లో పూడికతీత పనులను పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్ అధికారులకు సూచించారు. బుధవారం కాచిగూడ డివిజన్ కాశీరామ్ జీరా, ఇందిరానగర్ బస్తీలో చేపట్టిన నాలాలో పేరుకుపోయిన పూడికతీత పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆమె పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఈ రఘు, ఏఈ సబిత, నరేష్, బల్వీర్, పురుషోత్తం, భీమ్‌రాజ్, లావణ్య, ఆర్.సంతోష్, ఓం ప్రకాష్, సూరి, రవియాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే


కాలిన విస్తరాకులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చి చిరువ్యాపారం చేసుకుంటున్న వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారాం మండలం లక్ష్మితండాకు చెందిన ధీరావత్ కృష్ణ, ధీరావత్ లక్ష్మిలు కొంతకాలంగా బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు వద్ద గల ఫుట్‌పాత్‌పై విస్తరాకులు, పచ్చి పల్లీలు, మొగరం గడ్డలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు విస్తరాకులకు నిప్పు అంటించడంతో అవి కాలిబూడిదై సుమారు 30 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గోపాల్ సంఘటనాస్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. వెంటనే హిమాయత్‌నగర్ తహసీల్దార్‌కు ఫోన్ చేసి బాధితులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిక్కడపల్లి పోలీసులకు ఫోన్ చేసి నిందితులను పట్టుకొని శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన గ్రేటర్ అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం: ఎమ్మెల్యే


గోల్నాకలో డ్రైనేజీ పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ , కార్పొరేటర్ లావణ్య శ్రీనివాస్‌గౌడ్


రఘునాథ్‌నగర్‌లో సీసీ రోడ్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్

అంబర్‌పేట్: ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం గోల్నాక డివిజన్ సీపీఎల్ రోడ్‌లోని రూ.15.3 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానికంగా పాదయాత్ర నిర్వహించి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అంబర్‌పేట డివిజన్‌లో..

రఘునాథ్‌నగర్‌లో రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకర విద్యుత్ స్తంభాలను తొలగించాలి


ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట్: వివిధ ప్రాంతాల్లో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవాటిని వేయాలని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి ఏడీఈ శీనియ్యను కోరారు. బుధవారం విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం బతుకమ్మ కుంటలోని కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఏడీఈకి పలు సమస్యల గురించి విన్నవించారు. విద్యుత్ స్తంభాలు, లోఓల్టేజ్ వంటి సమస్యలను పరిష్కరించాలని ఏడీఈకి వినతిపత్రం అందజేశారు. అయితే విద్యుత్ సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని ఏడీఈ శీనయ్య తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, చంద్రమోహన్, బాలరాజు, శ్రీహరి మిర్యాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ ధర్మంలో గోవుకు పవిత్రస్థానం

- ఆచార్య ముదిగొండ శివ ప్రసాద్
- ‘సేవ్ కౌ’పురస్కారసభ
- ఆకట్టుకున్న ‘గో గీత’లఘు చిత్రం


మాట్లాడుతున్న ఆచార్య ముదిగొండ శివ ప్రసాద్

నల్లకుంట: హైదవ ధర్మంలో గోవుకు పవిత్ర స్థానం ఉందని ప్రముఖ కవి, విశ్రాంత ఆచార్యుడు ఆచార్య ముదిగొండ శివప్రసాద్ చెప్పారు. హిందువులు పవిత్రంగా పూజించే గోవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మంగళవారం సాయంత్రం బాగ్‌అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయం ధ్యానమందిరంలో గోమాత సేవా ట్రస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ‘సేవ్ కౌ’పురస్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిట్టల గోపాలకృష్ణ రూపొందించిన ‘గో గీత’లఘు చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. న్యూ ఎరా కళాశాల ప్రిన్సిపాల్ భాష్యం శ్రవణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముదిగొండ శివ ప్రసాద్ మాట్లాడారు. దీనికి విశిష్ట అతిథిగా హాజరైన శెనిశెట్టి రాజమౌళి గుప్త, గౌరవ అతిథులు గోపాదయాత్ర ప్రముఖుడు బాలస్వామి, కొండూరు సాయిబాబా, సీనియర్ జర్నలిస్ట్, నిర్మాత మహమ్మద్ షరీఫ్‌లతో కలిసి మాట్లాడారు. గో సంరక్షణలో గోమాత సేవా ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కుప్పా శ్రీనివాస్, సుబ్రహ్మణ్య స్వామి, హెచ్‌వీఆర్‌కే మూర్తి, ఆకుతోట రామారావు, కె.బాలసుబ్రహ్మణ్యం, పూర్ణచంద్రరావు, రామచంద్రరావు, డాక్టర్ మురళీధర్‌రావు, టి.యాదగిరిరావు, టీవీ స్వామి, బిల్లా వేణిరావు, పి.సంపత్‌రావు తదితరులకు గోసేవా పురస్కారాలు అందజేశారు. చివరగా గోమాత సేవా సంస్థ ట్రస్టీలు సాధన నరసింహాచార్యులు, కె.రాధాకృష్ణ, జీవీఎండీ శర్మ, పీఎస్ రామారావులను అతిథులు సన్మానించారు.

ట్యాంక్‌బండ్‌పై శివశంకర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

బీసీ సంఘాల సభలో వక్తల డిమాండ్

కవాడిగూడ: న్యాయకోవిదులు, న్యాయశిఖరం, కేంద్రమాజీ మంత్రి పుంజాల శివశంకర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని బీసీ సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు జనాభా దామాషా ప్రకారం సాధించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం, తెలంగాణ హిందూ బీసీ మహాసభ, జాతీయ బీసీ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో పండుగ సాయన్న స్ఫూర్తి స్థలం నుంచి ఖిలాషాపూర్‌లోని సర్దార్ సర్వాయి పాపన్న జన్మస్థలం వరకు పాదయాత్ర చేపట్టాయి. ఈ మేరకు పాదయాత్రలో భాగంగా బుధవారం మెహిదీపట్నం నుంచి బయల్దేరిన ర్యాలీ అమరవీరుల స్థూపం, కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం మీదుగా ట్యాంక్‌బండ్ వరకు సాగింది. అనంతరం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ నిలువెత్తు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం నాయకులు సర్దార్ పుటం పురుషోత్తంరావు పటేల్ మాట్లాడుతూ న్యాయ చట్టాలలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి శివశంకర్ అని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ హిందూ బీసీ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్ పటేల్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్, జాతీయ జేఏసీ అధ్యక్షుడు సాయిని నరేందర్, పులిగిరి క్షేత్రియ, నాయకులు తూము నవీన్‌పటేల్, తెప్ప అరుణ్ పటేల్, ఆవుల రామారావు, మారిశెట్టి నర్సింగ్‌రావు, బాషెట్టి నర్సింగ్‌రావు, తెల్ల హరికృష్ణ, అనంతుల నవీన్, చక్రం నాగరాజు, వనజ, వనిత, బండారి సురేష్, అరుణ, విమల, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

‘నారీశక్తి వందనం’ లైవ్ ప్రదర్శన


నారీ శక్తి వందనం ప్రధాని మోదీ లైవ్ ప్రసంగాన్ని తిలకిస్తున్న కావ్య కిషన్ రెడ్డి

నల్లకుంట: బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బుధవారం నల్లకుంట నర్సింహ బస్తీలో నారీ శక్తి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో వర్టికల్ మీటింగ్ ద్వారా ప్రధాని మోదీ ప్రసంగాన్ని లైవ్‌లో ప్రదర్శించారు. దీనికి హాజరైన కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి సతీమణి కావ్యకిషన్‌రెడ్డి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, స్థానిక కార్పొరేటర్ అమృత, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్‌తో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై ప్రధాని మోదీ ప్రత్యక్ష ప్రసంగాన్ని వీక్షించారు.

రజకులకు లోక్‌సభ సీట్లు కేటాయించాలి


సైదులు రజక

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు రజకుల జనాభాకు తగిన స్థాయిలో సీట్లను కేటాయించాలని చాకలి ఐలమ్మ విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపక చైర్మన్ ఆమనగంటి సైదులు రజక డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైదులు రజక మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలు ఆర్థికంగా, రాజీకయంగా, సామాజికంగా వెనుకబడిన రజకులను గుర్తించి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. తమ కులానికి చెందిన వారికి టికెట్లు ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకులు వడ్లకొండ ఆంజనేయులు, చాకలి రాజీవ్, పుప్పాల యాదయ్య, నేరెళ్ల కుమార్, అక్కెనపల్లి కృష్ణా, శ్రీలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సకల రంగాల్లో సమానత్వం అవసరం

మహిళాదినోత్సవంలో ఐద్వా రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు లక్ష్మి


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో మహిళలకు సమానత్వం కల్పించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, స్త్రీ విముక్తి కోసం జరిగే పోరాటాల కోసం స్ఫూర్తిని ఇచ్చేదే మహిళాదినోత్సవం అన్నారు. కార్మికులకు 8 గంటల పనిదినం కావాలని, పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించడంతోపాటు మెరుగైన సౌకర్యం కల్పించాలని, శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, అలాంటి మహిళల పట్ల వివక్ష కొనసాగించడం సరైంది కాదన్నారు. ఐద్వా అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి, పద్మశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అరిబండ ప్రసాదరావు, యూటీఎఫ్ నాయకులు వందన, సీఐటీయూ కార్యదర్శి జె.వెంకటేష్, ప్రసాద్, మమత, శృతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ ప్రజలను ఎప్పటికీ మరవను: లక్ష్మణ్

నియోజకవర్గంలో మూడు ఓపెన్ జిమ్‌ల ప్రారంభం


వీఎస్‌టీ చౌరస్తాలోని పార్కులో ఓపెన్ జిమ్ స్థలాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ‘నా రాజకీయ భవిష్యత్తుకు బాటలు వేసిన ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలను ఎప్పటికీ మరచిపోలేనని, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటానని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. రెండు కోట్ల ఎంపీ నిధులతో ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ స్ట్రీట్ నెంబర్-4, కవాడిగూడ, వీఎస్‌టీ చౌరస్తాలోని పార్కులో మూడు ఓపెన్ జిమ్‌లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. బుధవారం వీఎస్‌టీ చౌరస్తాలోని పార్కులో ఓపెన్ జిమ్‌స్థలాన్ని ఆయన పరిశీలించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడిగా ఉత్తర్‌ప్రదేశ్ నుంచి ఎంపికైనప్పటికీ ముషీరాబాద్ ప్రజల రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ‘నేను పుట్టిన ఘట్‌కేసర్ ప్రాంతం వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించడానికి తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో అనేక మంది పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పించానని తెలిపారు. రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రమేష్‌రాం, కె.ఉపేందర్, ఎస్.శ్రీనివాస్, గడ్డం నవీన్, నందు తదితరులు పాల్గొన్నారు.

దేశమే ప్రధాని మోదీ కుటుంబం: లక్ష్మణ్

కవాడిగూడ: భారతదేశాన్ని తమ కుటుంబంగా భావిస్తూ ప్రధాని నరేంద్రమోదీ పరిపాలన కొనసాగిస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బుధవారం కవాడిగూడ డివిజన్ బండ మైసమ్మ నగర్ కమ్యూనిటీ హాల్‌లో బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఓబీసీ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రధాని మోదీని విమర్శిస్తున్న నాయకులంతా వారి కుటుంబం కోసం పనిచేసేవారని అన్నారు. దేశంలోనే అన్ని రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకు గానే వాడుకున్నాయే తప్ప వారి అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు అన్నారు. సకల జనుల అభివృద్ధి కోసం మరోసారి రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్ కుమార్, ఓబీసీ అధ్యక్షులు ఉమేష్, బీజేపీ కవాడిగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, ఓబీసీ నేతలు శ్రీనివాస్ ముదిరాజ్, రంగరాజు గౌడ్, రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో మహిళాప్రాధాన్యత పెరగాలి

అసెంబ్లీ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి


మహిళలను సత్కరిస్తున్న సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి: చట్టసభలలో మహిళా ప్రాధాన్యత పెరగాలని రాష్ట్ర శాసనసభ తొలి సభాపతి సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయగానసభలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భిన్న రంగాలకు చెందిన కె.లలిత, ఎస్ శ్రీమణి, టీ.శోభారాణిలను ఆయన సత్కారించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన వేదికపై గానసభ పాలకమండలి సభ్యులు భమిడి ఉష తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక ఓటర్ జాబితా రూపకల్పన


పార్టీల సమావేశంలో ఏఆర్‌వోలు అపర్ణ, మారుతీదివాకర్

అంబర్‌పేట్: ఓటర్ జాబితాను పారదర్శకంగా, పకడ్బందీగా రూపొందించేందుకు ఆయా పార్టీల నేతలు సహకరించాలని అంబర్‌పేట నియోజకవర్గం ఏఆర్‌వోలు అపర్ణ, మారుతీదివాకర్ కోరారు. బుధవారం జీహెచ్ఎంసీ సర్కిల్-16 కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఒక్క పోలింగ్ బూత్‌లో 1,300 మంది ఓటర్లకు మించితే అదనపు పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తామన్నారు కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు వంటి అంశాలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు మహేందర్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

కాచిగూడ: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి కోరారు. ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం ఆయనను శివసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.సుదర్శన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు కలిసి సన్మానించి అభినందనలు తెలియజేశారు. గౌట్ గణేష్, నర్సింగ్ గౌడ్ పాల్గొన్నారు.

20 రోజుల్లో కలుషితనీటికి చెక్


బాప్టిస్ట్ చర్చి వీధిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ బాప్టిస్ట్ చర్చి వీధిలో 20 రోజుల్లో కలుషిత నీటి సరఫరా, అధ్వానపు రోడ్డును ఆధునీకరిస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్థానికులకు హామీ ఇచ్చారు. స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం ఎమ్మెల్యే జలమండలి ఏఈ సాయి, జీహెచ్ఎంసీ ఈఈ శ్రీనివాస్, డిఈ గీతాకుమారి, ఏఈ మురళీతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక పైపులైన్లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన మంచినీటి సరఫరా చేస్తామన్నారు. రాంనగర్ నుంచి పార్శీగుట్ట వరకు నూతనంగా రోడ్డు వేస్తున్నామని, భవిష్యత్తులో బాప్టిస్ట్ చర్చి వీధిలో వర్షపు నీటిసమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకులు ముఠా జైసింహ, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శివముదిరాజ్, నియోజకవర్గం మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, స్థానిక నాయకులు నాగులు యాదవ్, పూస గోరఖ్‌నాథ్, సత్యనారాయణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళాసాధికారతకు మోదీ చేయూత


ప్రధాని వర్చువల్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న పూస రాజు, రమేష్‌రాం, కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, రచనశ్రీ

ముషీరాబాద్: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాలలో రాణించే విధంగా ప్రధాని మోదీ చేయూతనిస్తున్నారని కార్పొరేటర్లు సుప్రియానవీన్‌గౌడ్, రచనశ్రీ అన్నారు. బుధవారం ముషీరాబాద్‌లోని హెరిటేజ్ హాల్‌లో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శక్తి వందన్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు పెద్దెత్తున పాల్గొని మోదీ ప్రసంగాన్ని భారీ స్క్రీన్ ద్వారా వీక్షించారు. అనంతరం కార్పొరేటర్లు మాట్లాడుతూ మహిళలందరూ బీజేపీకే మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం మహిళా కమిటీ నాయకులను వారు సన్మానించారు. కార్యక్రమాన్ని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పర్యవేక్షించారు. పూస రాజు, రమేష్‌రాం, బద్రినారాయణ, వెంకటేష్, పరిమళ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణతో పరిపూర్ణ ఆరోగ్యం



ముషీరాబాద్: దంత సంరక్షణతోనే పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని గాంధీ ఆసుపత్రి రిటైర్డ్ డెంటల్ సర్జన్ డాక్టర్ ఓ.నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో డాక్టర్ రావూస్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్, డాక్టర్ ఓ.నాగేశ్వర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో వరల్డ్ డెంటల్ డే కార్యక్రమంలో భాగంగా 80 మంది బాలికలకు దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు దేవరాజ్, ఆశోక్, అక్షయ్ కుమార్, హాస్టల్ వార్డెన్ భానుప్రియలు పాల్గొన్నారు.

అజయ్‌కుమార్‌కు ఎస్సీమోర్చా సత్కారం


ఎడెల్లి అజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎస్సీ మోర్చా నేతలు

కాచిగూడ: బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్‌గా నియమితులైన బాగ్ అంబర్‌పేటకు చెందిన ఎడెల్లి అజయ్ కుమార్‌ను ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందించారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేతలు కె.రాంచంద్ర, క్రాంతి కుమార్, ఎం.శివకుమార్, ఎల్.లక్ష్మణ్, శివరాజ్, భాస్కర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.